క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన రిటైర్డు ఉద్యోగులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మండల ఆ సంఘం అధ్యక్షుడు ఎస్.నర్సింలు అన్నారు. మూడేళ్లుగా మండలంలోని రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశానని, భవన నిర్మాణంతో పాటు సీనియర్ సిటిజన్ కార్డులు అందజేశామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సుశీల, కొత్త ప్రభు, నారాయణ, పురుషోత్తం, మోహన్ తదితరులు ఉన్నారు.

ఫ్రైడే.. డ్రైడే



రాయిలాపూర్‌లో డ్రైడే కార్యక్రమం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం అధికారులు డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని రాయిలాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి సలీం, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, వైద్యసిబ్బంది గ్రామంలో ఇంటింటికి తిరిగారు. నీటి తొట్లు, డబ్బాలలో నీటినిల్వ ఉండకుండా చూడాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎక్కువరోజులు నీరునిలువ ఉంటే దోమలు పెరిగి వ్యాధులు వస్తాయని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దీంతోపాటు కౌడిపల్లి, తునికి, వెంకటాపూర్(ఆర్) తదితర గ్రామాలలో డ్రైడే నిర్వహించి గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పాఠశాలలో స్కూటీకి చార్జింగ్



రెడ్డిపల్లి పాఠశాలలో స్కూటీకి చార్జింగ్ పెట్టిన దృశ్యం

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఎలక్ట్రిక్ స్కూటీకి చార్జింగ్ పెడుతూ విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుడు గోపాల్ తన ఎలక్ట్రిక్ స్కూటీకి ప్రతిరోజు పాఠశాలలోనే చార్జింగ్ చేసుకుంటున్నాడని ఆరోపిస్తున్నారు. సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నీరు నిల్వ ఉండొద్దు



డ్రైడే లో పాల్గొన్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మండల ప్రత్యేక అధికారి వెంకటయ్య, ఎంపీడీఓ దామోదర్ సూచించారు. శుక్రవారం మండలంలోని అంబాజీపేటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో వారు పాల్గొని పలు సూచనలు చేశారు. కుండీలు, టైర్లు, గుంతలలో నీరు నిలువ ఉండకుండా పారబోయాలని సూచించారు. ప్రతి శుక్రవారం పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం యాదమ్మ పాల్గొన్నారు.

భూ తగాదాల్లో దాడి

దంపతులకు గాయాలు



దాడిలో గాయపడిన పద్మ

శివ్వంపేట(నర్సాపూర్): భూతగాదాల్లో జరిగిన గొడవలో దంపతులు గాయపడిన సంఘటన మండల పరిధి తాళ్లపల్లి తండాలో శుక్రవారం జరిగింది. తండాకు చెందిన ధనవత్ గన్యా, అదే తండాకు చెందిన పలువురితో కొన్నాళ్ల నుంచి భూ వివాదం నెలకొంది. శుక్రవారం గన్యా పొలంలో వేసిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తుండగా.. అడ్డుకున్న గన్యా అతని భార్య పద్మపై దాడి చేశారు. దీంతో వారికి గాయాలయ్యాయి. కేసు దర్యాప్తులో ఉంది.

అధిక సాంద్రత.. అనేక లాభాలు

- పత్తిపంట సాగుపై శాస్త్రవేత్త రవికుమార్
- ఎకరాకు 30వేలు మొక్కలు నాటే అవకాశం
- 8 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి



పత్తిపంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు



రవికుమార్, తునికి కేవీకే శాస్త్రవేత్త

కౌడిపల్లి(నర్సాపూర్): వానాకాలం పంటల సాగులో రైతులు ఆరుతడి వాణిజ్య పంటగా పత్తిపంటను సాగు చేస్తారు. గతంలో మాదిరిగా సాలు పద్ధతిలో దూరం దూరంగా 90–90 సెం.మీ. విత్తనాలు నాటడం కన్నా హెచ్‌డీపీఎస్ (హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్) అధిక సాంద్రత పత్తిసాగుతో 90–15సెం.మీ. పద్ధతిలో విత్తనాలు విత్తడం వల్ల మొక్కల సంఖ్య పెరిగి దిగుబడి పెరుగుతోంది. దీంతో అధిక లాభం వస్తుందని తునికి (కృషి విజ్ఞాన కేంద్రం) కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ తెలిపారు. రైతుల కోసం శాస్త్రవేత్త తెలిపిన వివరాలు.. వర్షాకాలం పత్తిసాగులో రైతులు ఎస్‌పీఎస్ (స్క్వేర్ ప్లాంటింగ్ సిస్టమ్) పద్ధతిలో పత్తి మొక్కలను సాలు పద్ధతిలో 90సెం.మీ ఒకటి చొప్పున మొక్కలు నాటుతారు. దీంతో ఎకరంలో సుమారు 10వేల మొక్కలు నాటవచ్చు. అది (హెచ్‌డీపీఎస్) అధిక సాంద్రత పద్ధతిలో సాలు పద్ధతిలో 15సెంమీ ఒక మొక్క చొప్పున మొక్కలు నాటడంతో ఎకరాకు సుమారు 30వేల మొక్కలు నాటవచ్చు. దీంతో రైతులకు విత్తనం ఖర్చు, విత్తనం విత్తేందుకు కూలీల ఖర్చు కొద్దిగా పెరుగుతోంది. కాగా మొక్కల సంఖ్య పెరగడం వల్ల పంట పెరుగుదల నియంత్రణలో ఉండి కలుపు మొక్కలు ఎక్కువగా పెరగవు. దీంతో కలుపు నివారణ ఖర్చు తగ్గుతుంది. మొక్కకు గాలి వెలుతురు సమపాలల్లో అందుతుంది. పత్తి పంటపై పురుగులు, తెగులు ఉధ్రుతి తగ్గిస్తుంది. సాదారణ పద్ధతిలో మొక్క నుంచి పత్తిని తీసేందుకు కనీసం మూడు నుంచి నాలుగుసార్లు తీస్తారు. కాగా అధిక సాంద్రత పత్తి సాగుతో పత్తికాయలు ఒకేసారి పగిలు రెండుసార్లు పత్తిని తీస్తారు. దీంతో కలుపు నివారణ, రసాయనాల వాడకం, పత్తి తీసే కూలీల ఖర్చు తగ్గుతుంది. పత్తి దిగుబడి సైతం 8నుంచి 12 క్వింటాళ్లు పెరుగుతుంది. రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు చేయడం ఎంతో శ్రేయస్కరం. రైతులకు ఇంక ఏవైనా అనుమానాలు ఉంటే తనను సంప్రదించాలని కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ కోరారు.



సెంమీ దూరంలో వేసిన పత్తి మొక్కలు

నార్సింగి కాంగ్రెస్‌లో పదవుల లొల్లి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయి. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్ష పదవీ కోసం పోటీ పడుతున్న నాయకులను ఒక చోట కూర్చోబెట్టి చర్చించేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. విభేదాల కారణంగా పరస్పరం దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనలో కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవీ కోసం నామినేషన్ వేసిన అంచనూరి రాజేష్‌ను నార్సింగి మండల కేంద్రానికి చెందిన సంపత్ రెడ్డి చర్చలకు అని పిలిచి దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవీ కోసం పోటీ పడుతున్న నార్సింగికి చెందిన రాజేష్, రాజేందర్ పోటీ పడుతుండగా ఇద్దరి మధ్య సయోధ్య కోసం పిలిచి తనపై దాడి చేశారని రాజేష్ ఆరోపిస్తున్నారు. ఈ మేరకు రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్‌కు రాజేష్ ఫిర్యాదు అందించారు. వారం క్రితం కూడా ఇందిరమ్మ కమిటి సభ్యులు లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని ఓ నాయకులు పత్రికా ముఖంగా ఆరోపించగా, నిరూపించాలని ఇందిరమ్మ కమిటీ సభ్యులు సవాల్ విసిరారు. తాజాగా ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు వెళ్లింది. మండల అధ్యక్ష పదవీ కోసం ఇరువర్గాల విడిపోయి పరస్పర ఆరోపణలతో కాంగ్రెస్ సోషల్ మీడియా గ్రూప్‌లో చర్చగా మారింది.

మహంకాళి ఉత్సవాలకు ఏర్పాట్లు



మహంకాళి అమ్మవారి ఆలయం



కొలువుదీరిన అమ్మవారు

20 నుంచి జాతర ప్రారంభం

తూప్రాన్: డివిజన్ కేంద్రంలో ఉజ్జయిని మహంకాళి జాతర ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సావాలు మండలంలోనే అత్యంత వైభంగా జరుగుతాయి. ఆదివారం ఉదయం అమ్మవారికి నిజాభిషేకాలు, మధ్యాహ్నం బండ్లు బోనాలు, సోమవారం పూజలు, గావురంగం, మంగళవారం బౌరమ్మ పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బోనాల జాతర సందర్భంగా ప్రతి ఏటా భక్తుల కోసం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పులిహోరను ఈ సారి మరింత ఎక్కువగా భక్తులకు అందించడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50 శాతం సీట్లు

జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్



మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్ తదితరులు

జహీరాబాద్ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందని ఎంపీ.సురేష్ షెట్కార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నిర్మల మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, మెప్మా, సెర్ప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూచిక గణాంకాలు జాగ్రత్తగా పొందుపరచాలి

ఎంపీడీఓ సత్తయ్య యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్తయ్య

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగంగా పంచాయతీ రాజ్ శాఖ నిర్దేశించిన తొమ్మిది అంశాలలో సూచికలకు సంబంధించిన గణాంకాలను జాగ్రత్తగా పొందుపరచాలన్నారు. మండల కేంద్రమైన కొండాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో పాటు వివిధ శాఖల అధికారులకు అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సత్తయ్య యాదవ్ మాట్లాడుతూ...గ్రామపంచాయతీ అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖల పరంగా చేపడుతున్నటువంటి కార్యక్రమాల వివరాల ఆధారంగా జాతీయ గ్రామపంచాయతీ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో ప్రతీ గ్రామపంచాయతీ అభివృద్ధి సూచికల వివరాలు పొందుపరచాలని స్పష్టం చేశారు. ప్రతీ శాఖ పరంగా ఒక గ్రామ పంచాయతీ సాధించిన లక్ష్యాలను వాటికి సంబంధించిన వివరాలను పొందుపరిస్తే ఆ వివరాలతో వచ్చేటువంటి మార్కుల ఆధారంగా అవార్డుల ఎంపిక ఉంటుందన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన కార్యక్రమాల వివరాలు సంబంధిత విభాగం నుంచి తీసుకోవాల్సిందిగా కార్యదర్శులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీఓ వీరప్ప, ఏపీఎం సరిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల, విమల, మెడికల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

20న నర్సాపూర్‌లో బోనాలు

నర్సాపూర్: ఈనెల 20, 21 తేదీలలో నర్సాపూర్‌లో గ్రామ దేవతలకు బండ్ల ఊరేగింపు, బోనాలు చేయాలని నిర్ణయించినట్లు పూజారి హరిప్రసాద్‌శర్మ తెలిపారు. 20న పట్టణంలోని ముత్యాలమ్మ మాతకు బండ్ల ఊరేగింపు, బోనాల సమర్పణ ఉంటుందని చెప్పారు. 21న పట్టణంలోని నల్లపోచమ్మ, భూలక్ష్మమ్మ, దుర్గామాతకు బోనాలు, బండ్ల ఊరేగింపు పూజలు ఉంటాయని ఆయన వివరించారు.

దళారులను ఆశ్రయించవద్దు

అల్లాదుర్గం(మెదక్): కొత్త రేషన్ కార్డుల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ మల్లయ్య చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కొందరు దళారులు రేషన్ కార్డులు ఇప్పిస్తామని, కొత్త సభ్యులను కార్డులో చేర్పిస్తామని డబ్బులు వసూలుకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రేషన్ కార్డులు కోసం నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దళారులను ఆశ్రయిస్తే కార్డులు మంజూరు కావన్నారు.

విద్యార్థుల ప్రగతికి తోడ్పడాలి

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు తోడ్పడాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల ఉపస్థితి పట్టికతో పాటు, మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులో సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలో విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు



బోనాల ఊరేగింపులో పోతు రాజుల విన్యాసాలు

మునిపల్లి(అందోల్): ఆషాఢ మాసం సందర్భంగా దుర్గమ్మ, పాపమ్మ, పోచమ్మ అమ్మవార్లకు భక్తులు బోనాలు తీసి నైవేద్యం సమర్పించారు. మండలంలోని తాటిపల్లి, పిల్లోడి గ్రామాలలో శుక్రవారం బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిల్లోడి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో పంచాయతీ కార్మికుడు మృతి



నర్సింహులు

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంలో పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ పంచాయతీలో కార్మికుడిగా పని చేస్తున్న మూగ నర్సింలు(46) పంచాయతీకి చెందిన బోరు మోటార్ కాలిపోవడంతో బయటకు తీసి మరమ్మతులు చేయించారు. అనంతరం మోటారు దింపి స్టార్టర్ డబ్బాలో కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే గమనించి ఆస్పత్రికి తరలించేలోపే నర్సింలు మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పథకాలు అందుతున్నాయా..?

- ఉపాధి కూలీలతో ఎన్ఎల్ఎం బృందం ఆరా
- తునికి, రాయిలాపూర్‌లో పర్యటన



తునికిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎన్ఎల్ఎం టీం అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. ఉపాధిహామీ జాబ్‌కార్డులున్నాయా..? గిట్టుబాటు కూలీ వస్తుందా అని ఎన్ఎల్ఎం టీం సభ్యులు ఆరా తీస్తున్నారు. శుక్రవారం మండలంలోని తునికి, రాయిలాపూర్ గ్రామాలలో ఎన్ఎల్ఎం (నేషనల్ లేవల్ మానిటరింగ్) టీం అధికారులు సురంజన్‌రెడ్డి, సాధిక్అలీ పర్యటించారు. ఉపాధిహామీ కూలీలు, ఆసరా లబ్ధిదారులు, డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు వస్తున్నాయా, కూలీ గిట్టుబాటు అవుతుందా, ఎంత కూలీ వస్తుంది, ఆసరా పింఛన్లు ఇస్తున్నారా, రుణాలు ఇస్తున్నారా, ఆర్థిక అభివృద్ధికి ఏం పనులు చేస్తున్నారు.. అంటూ లబ్ధిదారులను అడిగారు. ఎక్కడైన సమస్యలుంటే తెలపాలన్నారు. పనులు చేస్తున్నామని కూలీ డబ్బులు వస్తున్నాయని కూలీలు తెలిపారు. అనంతరం గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ, పంచాయతీరాజ్ పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. గ్రామంలో వైద్యచికిత్సలు, పోషకాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాయిబాబ, పీఆర్ డిప్యూటీ ఈఈ అమరేశ్వర్, ఎంపీడీఓ శ్రీనివాస్, హెచ్ఆర్ రాజేందర్‌రెడ్డి, ఎంపీఓ కలీముల్లా, ఏపీఓ పుణ్యదాస్, పీఆర్ఏఈ మారుతి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశం, సలీం వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

ఎంపీడీఓ రియాజొద్దీన్



నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ రియాజొద్దీన్ అన్నారు. శుక్రవారం టేక్మాల్ మండలం ఎల్లంపల్లిలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తూ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తూ, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టైర్లు, కుండీలు, గుంతలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. రోడ్లపై చెత్తను పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సత్యం తదితరులు పాల్గొన్నారు.

దాతలు సాయం కోసం వేడుకోలు



దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న అక్కా చెల్లెలు

శివ్వంపేట(నర్సాపూర్): ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికి నిర్మాణ పనులు ప్రారంభించేందుక ఆర్థిక స్థోమత లేక ఓ మానసిక వికలాంగురాలు దాతల సహకారం కోసం ఎదురుచూస్తోంది. మండల పరిధి దొంతి గ్రామానికి చెందిన కొత్తపల్లి శైలజ మానసిక వికలాంగురాలు. తల్లిదండ్రులు చనిపోవడంతో సరైన గూడులేదు. ఈ మధ్య కాలంలో శైలజ అక్క రాజశ్రీ భర్త చనిపోవడంతో అమె కూడా గ్రామంలోనే ఉంటుంది. వీరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినప్పటికి పనులు ప్రారంభించేందుకు ఆర్థిక స్థోమత లేక దాతల సహాయం కోసం దీనంగా ఎదురుచుస్తున్నారు. వీరికి ఉన్న ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి వదిలేశారు. ఎవరైన దాతలు ముందుకు వచ్చి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రభుత్వం నుంచి వచ్చే రూ.5 లక్షలను తీసుకోవాలని వారు కోరారు.

జీఐఎస్ టెక్నాలజీ ఎంతో ఉపయోగం

ఐఐటీ ప్రొఫెసర్ రోహిత్ శ్రీవాస్తవ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీవాస్తవ, పక్కన కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం)తో ఇంజనీరింగ్ అధ్యాపకులకు ఎంతో ఉపయోగపడుతుందని తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ రోహిత్ శ్రీవాస్తవ చెప్పారు. శుక్రవారం స్థానిక బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో అప్లికేషన్స్ ఆఫ్ జీఐఎస్ ఇన్ సివిల్ ఇంజనీరింగు అంశంపై వారం రోజు ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీఐఎస్ టెక్నాలజీని వివిధ అంశాలలో ఎలా ఉపయోగించాలో ఆయన ఫ్యాకల్టీకి వివరించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, సివిల్ హెచ్ఓడీ కృష్ణారావు, మేనేజర్ బాపిరాజు, ఏఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై భగ్గుమన్న తండావాసులు



నిరసన తెలుపుతున్న రూప్ల తండా వాసులు

శివ్వంపేట(నర్సాపూర్): తండాలో వీధి కుక్కల దాడి కారణంగా బాలుడు మృతి చెందడంపై తండావాసులు శుక్రవారం రాత్రి ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని రూప్ల తండాలో వీధి కుక్కల దాడిలో మూడేళ్ల బాలుడు నితిన్ మృతి చెందాడు. దీంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కొంత కాలం నుంచి తండాలో వీధి కుక్కలు వీరవిహారం చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తండావాసులు పేర్కొన్నారు. వీటి మూలంగా నిత్యం ఇబ్బందులు పడుతున్నామని శుక్రవారం అభం శుభం తెలియని బాలుడు మృతిచెందడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు.

వృద్ధురాలిపై కుక్కల దాడి

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటి ముందు కూర్చున్న వృద్ధురాలిపై వీధి కుక్కలు తీవ్రంగా దాడి చేశాయి. ఈ ఘటన మండలంలోని మడూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎండల బాగమ్మ ఇంటి ముందు కూర్చోగా కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఆమె కాలుకు తీవ్ర గాయం కాగా కుటుంబ సభ్యులు మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

నియోజకవర్గానికి 3,332 రేషన్ కార్డులు మంజూరు.. ఆర్డీఓ రాంరెడ్డి

జహీరాబాద్ టౌన్: దశాబ్ద కాలంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పేదలకు రేషన్ కార్డులు అందనున్నాయి. ఈ నెల 19న కొత్త కార్డులు అందజేస్తామని ఆర్డీఓ రాంరెడ్డి తెలిపారు. పేద ప్రజలు గత కొన్నేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. జహీరాబాద్ నియోజవర్గంలో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలు ఉండగా పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. మూడు దశల్లో వెరిఫికేషన్ పూర్తి చేసి 3,332 కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. జహీరాబాద్ మండలంలో 1271, మొగుడంపల్లిలో 595, న్యాల్‌కల్ మండలంలో 609, కోహీర్‌లో 355, ఝరాసంగం మండలంలో 502 కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి. కొత్త కార్డులకు అదనంగా 64,662 క్వింటాళ్ల బియ్యం అవసరం ఉంటుంది.

2,950 మంది పేర్ల చేర్పు

జహీరాబాద్ నియోజకవర్గంలో 2,950 మంది కుటుంబ సభ్యుల పేర్లను పాత రేషన్ కార్డులో చేర్పించారు. అనేక కారణాల వల్ల ఎంతో మంది వారి పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చేందుకు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం రేషన్ కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తు పెట్టుకున్నారు. జహీరాబాద్ మండలంలో 1,280,మొగుడంపల్లి మండలంలో 374, ఝరాసంగం మండలంలో 385,న్యాల్‌కల్‌లో 315, కోహీర్ మండలంలో 596 మందిపేర్లను చేర్పించామని అధికారులు తెలిపారు. పట్టణంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్ శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని చెప్పారు.